క్లుప్తంగా

ఆదివాసీ ఎరుకుల రాష్ట్ర కార్యదర్శిగా కోటయ్య



కోట: ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ ఎరుకుల సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శిగా కోట జెడ్పీటీసీ సభ్యుడు దాసరి కోటయ్య నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం కోటలో ఆయన మాట్లాడుతూ విజయవాడలో జరిగిన ఎరుకుల సేవాసంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో తనను ఎంపిక చేసినట్లు తెలిపారు. అణగారిన వర్గాలుగా ఉన్న ఎరుకులలు చైతన్యవంతులై ముందుకు సాగాలన్నారు. వారి హక్కుల సాధన కోసం కృషి చేస్తానన్నారు.

విద్యుత్ స్తంభాల తొలగింపు



సాక్షి ఎఫెక్ట్..

సైదాపురం: అడ్డుగా ఉన్నా...తొలగించరా? అనే కథనం సోమవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైంది. దీంతో మండల కేంద్రమైన సైదాపురంలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డుకు అడ్డుగా ఉన్న రెండు స్తంభాలను విద్యుత్ శాఖ అధికారులు స్పందించి మంగళవారం తొలగించారు. దీంతో రహదారికి ఎలాంటి సమస్య లేకుండా పోయింది.

అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు



చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

సైదాపురం: మండలంలోని వేములచేడు, కమ్మవారిపల్లి, సైదాపురం గ్రామాల్లో పల్లెపండుగ కార్యక్రమంలో చేసిన అభివృద్ధి పనులను మంగళవారం వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ప్రారంభించారు. అనంతరం పాడుపు మహిళలకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ ఈ రమాదేవి, ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్, మండల కన్వీనర్ మోహన్‌కృష్ణారెడ్డి, సుబ్రమణ్యంరాజు, కేపీ రాజు, దిలీప్‌చౌదరి, సుబ్రమణ్యంనాయుడు, కరణం శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే విద్యుత్ అదాలత్



రాపూరు విద్యుత్ అదాలత్‌లో పాల్గొన్న అధికారులు

రాపూరు: విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మంగళవారం జరిగిన ప్రత్యేక విద్యుత్ అదాలత్‌లో పలు సమస్యలు పరిష్కారమైనట్లు ఏఈ కార్తీక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు రూరల్ విద్యుత్ డివిజన్ పరిధిలోని రాపూరు, ముత్తుకూరు, నెల్లూరు రూరల్, పొదలకూరు తదితర ప్రాంతాల వినియోగదారులు తమ సమస్యలను అదాలత్‌లో పరిష్కరించుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ అదాలత్ చైర్మన్ ఆంజనేయమూర్తి, సభ్యులు రామమోహన్‌రావు, అంజనీకుమార్, కార్యనిర్వాహక ఇంజినీర్ సోమశేఖర్‌రెడ్డి, డీఈలు సురేష్, సుబ్రమణ్యం, వినియోగదారులు పాల్గొన్నారు.

పాఠశాల విలీనంపై ఆందోళన



బద్దెవోలు ప్రాథమిక పాఠశాల ముందు ఆందోళన

కలువాయి: పాఠశాలల విలీనంపై ఆందోళనలు కొనసాగుతున్నాయి. తాజాగా మంగళవారం పాత బద్దెవోలు మెయిన్ ప్రాథమిక పాఠశాలను బేసిక్ పాఠశాలగానే కొనసాగించాలని, ఇక్కడి 3, 4, 5 తరగతుల విద్యార్థులను మరో పాఠశాలకు తరలించరాదని ఎస్ఎంసీ సభ్యులు, తల్లిదండ్రులు ఆందోళన నిర్వహించారు. కొత్త బద్దెవోలు యూపీ పాఠశాలను ఉన్నత పాఠశాలగా మార్చాలని డిమాండ్ చేస్తూ వరుసగా రెండో రోజు ఎస్ఎంసీ సభ్యులు, తల్లిదండ్రులు ధర్నా నిర్వహించారు.

పడకేసిన పల్లెపాలన

- సచివాలయ వ్యవస్థ నిర్వీర్యం
- అందుబాటులో లేని సచివాలయ సిబ్బంది
- ఖాళీ కుర్చీలతో సచివాలయాలు.
- సర్టిఫికెట్ల కోసం ప్రదక్షిణలు
- కూటమి ప్రభుత్వంలో ప్రజలకు కష్టాలు

సూళ్లూరుపేట: గ్రామీణ ప్రాంత ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థను చాపకింద నీరులా నిర్వీర్యం చేస్తున్నారు. దీంతో ప్రజలకు మరోమారు జన్మభూమి కార్యక్రమం తరహాలో కష్టాలను పరిచయం చేస్తున్నారు. సచివాలయాలకు మెయింటెనెన్స్ కింద ఇచ్చే గ్రాంట్‌ను నిలిపివేయడంతో చాలా వరకు సచివాలయాల్లో ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయి కంప్యూటర్లు మూలనపడ్డాయి. సచివాలయ సిబ్బందిని కావాలనే వేరే పనులకు వాడుకుంటూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. – సూళ్లూరుపేట

గత ప్రభుత్వం ప్రజలకు, సచివాలయ సిబ్బందికి మధ్య వారధిలా పనిచేసే వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి, గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. ఈ సచివాలయాల్లో 545 రకాల సేవలను ప్రజలకు అందించేవారు. దీంతో మండల కార్యాలయాలతో పనే లేకుండా చేశారు. అయితే గత ప్రభుత్వానికి పూర్తి భిన్నంగా వ్యవహరిస్తూ వలంటీర్ వ్యవస్థను రద్దుచేసిన విధంగానే సచివాలయ వ్యవస్థను కూడా రద్దు చేసే ప్రయత్నాలు చేస్తూ సచివాలయాల్లో సిబ్బందిని లేకుండా చేస్తున్నారు.

తప్పని వ్యయప్రయాసలు

తిరుపతి జిల్లాలో 726 సచివాలయాల్లో ఒక్కొక్క సచివాలయానికి పది మంది చొప్పున 7,260 మంది సచివాలయ సిబ్బంది ఉన్నారు. ఒక్కో సచివాలయంలో పరిపాలన, విద్యా, సంక్షేమం, ప్లానింగ్, నీటి సరఫరా, మహిళా పోలీస్, పారిశుధ్యం, వీఆర్వో, ఇంజినీరింగ్, ఏఎస్ఎం విభాగాలతో గ్రామ పరిపాలనా విభాగం పని చేయాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసే ప్రయత్నాలను చాపకింద నీరులా చేస్తున్నారు. 2014–19 పరిపాలనలో పడిన అవస్థలను ప్రజలకు మళ్లీ పరిచయం చేస్తున్నారు. ప్రస్తుతం ఏ సర్టిఫికెట్ కావాలన్నా మండల కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితులు దాపురించాయి. సచివాలయ వ్యవస్థను పట్టించుకోకుండా అందులో పనిచేస్తున్న సిబ్బందిని వివిధ రకాలైన సర్వేలు, పింఛన్ల పంపిణీకి ఉపయోగించడంతో సచివాలయాలు బోసిపోతున్నాయి. రేషన్ కార్డులలో పేర్లుమార్పు, తీసివేయడం, పొలం వన్‌బీ, అడంగల్, పొలాన్ని ఆన్‌లైన్ చేయడం, ఇతర ప్రధాన సేవల కోసం రెవెన్యూ కార్యాలయం చుట్టూ రోజులు తరబడి తిరుగుతున్నా సమస్యలు పరిష్కారం కావడం లేదు. ప్రజల్ని ఇబ్బందులకు గురిచేసి మండల కార్యాలయాల చుట్టూ తిరిగేలా చేస్తోంది కూటమి ప్రభుత్వం.



దొరవారిసత్రం మండలం నెలబల్లిలో సచివాలయ భవనం



బోసిగా ఉన్న సూళ్లూరుపేట పట్టణంలోని సచివాలయం

భూసమస్యలకు పరిష్కారం లేదు



భూసమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాం. అయినా పరిష్కారం కావడం లేదు. గతంలో సచివాలయాల్లో వీఆర్‌ఓ గ్రామంలో అందుబాటులో ఉండి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడడమే తరువాయి వీఆర్‌ఓ మండలకేంద్రంలో కూర్చుంటున్నారు. అడంగళ్లు, వన్‌బీ, పట్టాదారు పాసుపుస్తకాల కోసం కార్యాలయాలు చుట్టూ తిరగడం మళ్లీ అలవాటైపోయింది. సచివాలయంలో పలికే నాథుడే లేకుండా పోయారు.

– సుంకర అల్లెయ్య, మన్నారుపోలూరు

మండల కేంద్రానికి వెళ్లాల్సిందే...



ఎలాంటి వ్యయ ప్రయాసలు లేకుండా గ్రామస్థాయిలోనే అయ్యే పనులు ఇప్పుడు మండల కేంద్రానికి వెళ్లాయి. గత ప్రభుత్వం గ్రామస్థాయిలోనే సమస్యలను పరిష్కరించి గ్రామస్వరాజ్యాన్ని చూపించింది. ఇప్పుడేమో వలంటీర్లను కూడా లేకుండా చేసేసి సచివాలయం సిబ్బందిని ఇతర పనులకు తరిమేశారు. బాధితులు ఏదైనా పనుల నిమిత్తం వస్తే కనీసం పలికే వారు లేకుండా పోయారు. గతంలో ఏదైనా పని ఉంటే వలంటీర్‌కు చెబితే చాలు అన్నీ వారు చూసుకుని పని చేసి పెట్టేవారు. ఇప్పుడేమో ఆ పరిస్థితి లేకుండా పోయింది.

– పాల మురళీ, సూళ్లూరుపేట

నయవంచకుడు చంద్రబాబు



మాట్లాడుతున్న డీసీసీబీ మాజీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి

పెళ్లకూరు: ఎన్నికల సమయంలో అబద్ధాలు చెప్పి రాష్ట్ర ప్రజలను నమ్మించి మోసం చేసిన నయవంచకుడు సీఎం చంద్రబాబు అని డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి ఘాటుగా విమర్శించారు. మంగళవారం చిల్లకూరులోని ఆయన నివాసంలో మీడియాతో మాట్లాడారు. 2024 ఎన్నికల ప్రచారంలో మహాశక్తి పేరుతో రాష్ట్రంలోని ఆడబిడ్డలకు వరాల జల్లు కురిపిస్తానని చెప్పి నిలువెల్లా మోసం చేశాడని దుయ్యబట్టారు. సూపర్ సిక్స్ పేరుతో బూటకపు మాటలు చెప్పాడని విమర్శించారు. సొంత పుత్రుడు లోకేష్, దత్త పుత్రుడు పవన్ కలిసి చంద్రబాబు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసేలా గట్టి చర్యలు తీసుకోవాలని హితవు పలికారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అమ్మ ఒడి, వాహన మిత్ర, వైఎస్ఆర్ ఆసరా, చేయూత, గోరుముద్ద, పెన్షన్, రైతుభరోసా తదితర అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు.

మెరుగైన సౌకర్యాలు అందించండి



కార్మికులకు నగదు బహుమతులను అందిస్తున్న ఆర్టీసీ ఈడీ నాగేంద్రప్రసాద్

రాపూరు: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేవారికి మెరుగైన సౌకర్యాలు అందించాలని ఆర్టీసీ ఈడీ నాగేంద్రప్రసాద్ సూచించారు. రాపూరు ఆర్టీసీ డిపోను మంగళవారం సందర్శించి కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు కలిసి కట్టుగా పనిచేసి ఆర్టీసీకి మంచిపేరు తీసుకురావాలని కోరారు. అన్ని ఆర్టీసీ బస్టాండ్లు, బస్సుల్లో క్యూ ఆర్‌కోడ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఫోన్ ద్వారా ఆర్టీసీ సేవలు తెలుసుకోవడమే కాకుండా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఇందులో ఫిర్యాదు చేస్తే ప్రభుత్వానికి, ఆర్టీసీ అధికారులకు సమాచారం అందుతుందని, దీంతో ఆ ప్రాంత సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తామని తెలిపారు. ఆర్టీసీకి కొత్తగా 1489 బస్సులు వచ్చాయని, మరికొన్ని బస్సులు వస్తాయన్నారు. ఈ బస్సులను అవసరమైన డిపోలకు పంపిస్తున్నామని పాత బస్సుల స్థానంలో వీటిని నడుపుతామన్నారు. రాపూరు డిపోకు 5 కొత్త బస్సులను ఇచ్చామన్నారు. జనవరి మాసంలో అధిక కలెక్షన్, ఆయిల్ తీసుకువచ్చిన కార్మికులకు నగదు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ అనిల్‌కుమార్, ఎస్‌టీఐ, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు అమ్మితే కఠిన చర్యలు



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శివశంకర్

దక్కిలి: మత్తు పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శివశంకర్ తెలిపారు. మంగళవారం స్థానిక ఏపీ అంబేడ్కర్ గురుకులం పాఠశాల, కళాశాల దగ్గర రోడ్డు పక్కన ఉన్న దుకాణదారులు తదితరులకు మత్తు పదార్థాల నివారణపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు ప్రభుత్వ పాఠశాల, కళాశాలకు 300 మీటర్లు దూరం వరకు సిగరెట్, బీడీ, హాన్స్ తదితర మత్తు పదార్థాలను విక్రయించకూడదని దుకాణదారులను హెచ్చరించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి



మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

గూడూరు రూరల్: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామని నెల్లూరు జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ తెలిపారు. గూడూరు మండలం చెన్నూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఒన్నా మోహన్‌క్రిష్ణ బ్రదర్స్ సహకారంతో నిర్మించిన నూతన గ్రంథాలయ భవనాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుస్తక పఠనం నేర్చుకుంటే భవిష్యత్తులో ఎన్నో ఉపయోగాలు ఉంటాయన్నారు. అనంతరం పిల్లలకు మధ్యాహ్న భోజనం వడ్డించిన అనంతరం రుచి చూశారు. రూ.10 లక్షలతో జొన్నా మోహన్ క్రిష్ణ, సునీతాదేవి భవనం నిర్మించి ఇవ్వడం అభినందనీయమన్నారు. గూడూరు జెడ్పీటీసీ ఊటుకూరు యామిని, ఎంపీడీఓ మధుసూదన్‌రావు, పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాత్రికి రాత్రే ఎర్రమట్టి తవ్వకాలు



యాకసిరి రిజర్వు ఫారెస్టులో తవ్వకాలు చేపట్టడంతో ఏర్పడిన గుంతలు

చిట్టమూరు: వారం రోజుల నుంచి యాకసిరి ప్రాంతంలో ఉన్న రిజర్వు ఫారెస్టు భూమిలో ఎర్రమట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. దీనిపై కన్నేసిన నాయుడుపేటకు చెందిన కొంత మంది కూటమి నాయకులు రాత్రి పూట జేసీబీలతో తవ్వకాలు చేపట్టి టిప్పర్లతో తరలించేస్తున్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యపానంపై చర్యలు



అవగాహన కల్పిస్తున్న సీఐ ఏవీ రమణ

బాలాయపల్లి(సైదాపురం): బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు తీసుకుంటామని వెంకటగిరి సీఐ ఏవీ రమణ సూచించారు. బాలాయపల్లి మండలంలోని నిడిగల్లు గ్రామ బస్‌షెల్టర్ వద్ద పోలీసుల ఆధ్వర్యంలో ఫ్లెక్సీ ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం చట్టరీత్యా నేరమన్నారు.ఎస్ఐ గోపి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీఆంజనేయుని ఆశీస్సులతో లోక కల్యాణం



శ్రీఆంజనేయుని సేవలో అరవింద్ లింబావళి, మాదాసు గంగాధరం

కలువాయి: శ్రీఆంజనేయ స్వామి ఆశీస్సులతో లోక కల్యాణం జరుగుతుందని కర్ణాటక బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి అరవింద్ లింబావలి అన్నారు. కలువాయి మండలం కుల్లూరులో నూతనంగా నిర్మించిన శ్రీవీరాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం నిర్వహించిన పునఃప్రతిష్ట కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మట్లాడుతూ గ్రామానికి చెందిన ప్రముఖ కాంట్రాక్టర్ చల్లా సీతారాము, కమల దంపతులు గ్రామంలో ఆలయాన్ని పునర్నిర్మించడం అభినందనీయమన్నారు. మాజీ శాసన మండలి సభ్యులు మాదాసు గంగాధరం, నళినమ్మ దంపతులతో కలిసి స్వామి వారి ఆశీస్సులు పొందారు. వడ్డెర కమ్యూనిటీ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి జయశంకర్, ఆలయ ట్రస్టీ చల్లా సీతారాము, కమల తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

నాయుడుపేట టౌన్: పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకులంలో విద్యార్థుల ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ దాదాపీర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురుకులంలో 2025–26 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరేందుకు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని వెల్లడించారు. 2025 మార్చి నెల 6వ తేదీ వరకు దరఖాస్తులను అందజేయవచ్చునని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ కోరారు. వివరాలకు బాలుర గురుకులంలో ప్రిన్సిపల్‌ను సంప్రదించాలని కోరారు. 97045 50098, 62810 42982 నంబర్లకు ఫోన్ చేసి పూర్తి వివరాలను తెలుసుకోవచ్చన్నారు.

శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



శ్రీషణ్ముగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, అమ్మ వార్లు

నాయుడుపేట టౌన్: పట్టణంలోని శ్రీషణ్ముగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు అభిషేకాలను జరిపి ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శనం కల్పించారు.

నేడు ప్రత్యేక పూజలు

స్వర్ణముఖి నది ఒడ్డున ఉన్న శ్రీదుర్గామల్లేశ్వరి దేవి ఆలయంలో బుధవారం నాగ పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేపట్టనున్నట్లు ఆలయ నిర్వాహకులు మంగళవారం తెలిపారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయం వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపి సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు వివరించారు.

గిరిజన కుటుంబాలపై దౌర్జన్యం



ఎంపీడీఓకి ఫిర్యాదు చేస్తున్న గిరిజనులు

వాకాడు: గంగన్నపాళెం గ్రామంలో ఓ అగ్ర కులానికి చెందిన వ్యక్తి తమ భూమిని లాక్కోవడానికి దౌర్జన్యం చేస్తున్నాడని బాధిత గిరిజన కుటుంబాలు మంగళవారం ఎంపీడీఓ అన్నపూర్ణారావుకు ఫిర్యాదు చేశాయి. బాధితుల వివరాల మేరకు 70 ఏళ్ల కిందట పొలం గట్టుపై జీవిస్తున్న తమ కుటుంబాలకు గ్రామ కంఠంలో ఇంటి స్థలాలు కేటాయించారని తెలిపారు. అప్పటి నుంచి ఆ స్థలంలో తాము మూడు కుటుంబాలు ఇళ్లు నిర్మించుకుని మిగిలిన ఖాళీ స్థలంలో మిరప తోట వేసుకున్నామని తెలిపారు. పెద్దలు గతించిన తరువాత వారి వారసులైన పత్ర గోపాలయ్య, పత్ర బలరామయ్య, మానికల వెంకటరమణయ్య, చిన్నరామయ్యలు ఆ స్థలంలో ఇళ్లతోపాటు మిగిలిన స్థలంలో కూరగాయల తోట వేసుకున్నారు. అయితే అదే గ్రామానికి చెందిన అయోధ్య బాలచంద్రయ్యశెట్టి తమపై దౌర్జన్యం చేస్తున్నాడని, కులం పేరుతో దూషిస్తున్నాడని బాధితులు ఎంపీడీఓ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎంపీడీఓ అన్నపూర్ణారావు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయి న్యాయం చేస్తామన్నారు.

వ్యాపారులు లైసెన్స్‌లు కలిగి ఉండాలి

వెంకటగిరి రూరల్: వ్యాపారులు కచ్చితంగా లైసెన్సులు కలిగి వ్యాపారాలు సాగించాలని ఫుడ్‌సేఫ్టీ అధికారి నర్మద సూచించారు. పట్టణంలోని పాత బస్టాండ్ సమీపం వద్ద ఉన్న ఓ కిరణా జనరల్ స్టోర్‌లో మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. దుకాణం గోదాములో పొంది పరచి ఉన్న స్టాక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాసిరకంగా ఉన్న సరుకులను గుర్తించి పరిశీలన నిమిత్తం ల్యాబ్‌కు తరలించామన్నారు. ల్యాబ్‌లో రిపోర్టుల ఆధారంగా దుకాణ యజమానిపై చర్యలు తీసుకోనున్నట్లు తెలియజేశారు. ప్రస్తుతం తనిఖీ చేసిన దుకాణంలో కొన్ని కాలం చెల్లిన సరుకులను గుర్తించామని, తిరుపతి జిల్లా అధికారులు దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకోనున్నట్లు తెలియజేశారు. సామగ్రి కొనుగోలు చేసిన ప్రజలకు బిల్లులను తీసుకోవాలని సూచించారు. అనంతరం దుకాణం యజమానికి నోటీసులు జారీ చేశారు.

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం శ్రేయస్కరం



విజేతలకు బహుమతులు అందిస్తున్న అనిల్‌కుమార్

రాపూరు: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని రాపూరు ఆర్టీసీ డిపో మేనేజర్ అనిల్‌కుమార్ పేర్కొన్నారు. రాపూరు ఆర్టీసీ డిపో నుంచి వెంకటగిరి, గూడూరు మార్గంలో ప్రయాణికులకు లక్కీ డిప్ ద్వారా విజేతలను ఎంపిక చేసి మంగళవారం బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులో ప్రయాణించేవారు బస్సు దిగే సమయంలో తమ టిక్కెట్‌పై ఫోన్ నెంబర్, అడ్రస్ రాసి బస్సులో ఏర్పాటు చేసిన బాక్స్‌లో వేయాలని కోరారు. ప్రతి 15 రోజులకు ఒక లక్కీడిప్ ద్వారా నలుగురిని ఎంపిక చేసి బహుమతులు అందిస్తున్నట్లు వివరించారు. ఎస్‌టీఐ బషీర్‌అహ్మద్, విజేతలు, ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికులు ఉన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవం సురక్షితం



గర్భవతులకు పరీక్షలు నిర్వహిస్తున్న రాజకుమారి

రాపూరు: ప్రభుత్వ వైద్యశాలల్లో కాన్పులు చేయించుకోవాలని వేపినాపి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు రాజకుమారి అన్నారు. రాపూరు మండలం వేపినాపి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం గర్భవతులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భవతులకు వైద్యపరీక్షలు, రక్తపరీక్షలు నిర్వహించామని, ఐరన్ తక్కువ ఉన్నవారికి మాత్రలు అందించామన్నారు. గర్భవతులు ప్రతి నెలా వైద్య పరీక్షలు చేయించుకుని, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది, గర్భవతులు పాల్గొన్నారు.

మతి స్థిమితం లేని వ్యక్తి హల్‌చల్



గుర్రపు డెక్క మధ్యలో ఉన్న మతిస్థిమితం లేని వ్యక్తి

చిల్లకూరు: గూడూరు పట్టణ సమీపం, పెద్ద చెరువులో గత రెండు రోజుల నుంచి ఓ వ్యక్తి గుర్రపుడెక్క మధ్యలో ఉంటూ హల్‌చల్ చేశాడు. మంగళవారం ఉదయం ఒకటవ పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ తిరుపతయ్య చెరువు వద్దకు వచ్చి నీటిలో ఉన్న వ్యక్తిని బయటకు తీసేందుకు ప్రయత్నించినప్పటికీ వీలు కాలేదు. సమీపంలోని గిరిజనుల సాయం తీసుకుని అతన్ని బటయకు తీసుకొచ్చారు. అతడు మతిస్థిమితం లేని వ్యక్తిగా గుర్తించారు. అనంతరం 108 వాహనంలో గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

వ్యభిచార గృహంపై దాడి

నాయుడుపేట టౌన్: టీచర్స్ కాలనీలో ఓ ఇంటిలో నివాసం ఏర్పాటు చేసుకుని వ్యభిచారం చేయిస్తున్నారన్న సమాచారంపై మంగళవారం సీఐ బాబీ పోలీసులతో తనిఖీలు చేపట్టారు. ఇంటి వద్ద ఉన్న ముగ్గురు మహిళలు, ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ వెల్లడించారు. నెల్లూరు ప్రాంతానికి చెందిన మహిళ నాయుడుపేటలో నివాసం ఉంటూ ఇతర ప్రాంతాల నుంచి మహిళలను తీసుకొచ్చి వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు గుర్తించినట్లు సీఐ తెలిపారు. నిర్వాహకురాలితో పాటు ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

బాలికల అదృశ్యం కేసు సుఖాంతం



వివరాలు వెల్లడిస్తున్న గూడూరు డీఎస్పీ గీతాకుమారి

గూడూరు రూరల్: గిరిజన గురుకుల బాలికల పాఠశాల నుంచి అదృశ్యమైన బాలికల కథ సుఖాంతమైంది. మంగళవారం గూడూరు డివిజనల్ పోలీస్ కార్యాలయంలో డీఎస్పీ గీతాకుమారి వివరాలను వెల్లడించారు. ఆమె మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో చదివే ఇద్దరు పదో తరగతి విద్యార్థినులు పరీక్షలపై భయంతో సోమవారం గురుకులం నుంచి అదృశ్యమయ్యారని తెలిపారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ రెండో పట్టణ సీఐ శ్రీనివాసులుకు పిర్యాదు చేశారని, సీఐ వెంటనే ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారని అన్నారు. ఇద్దరు బాలికలు డక్కిలి మండలం శ్రీపురం గ్రామంలో వారి బంధువుల ఇంటికి వెళ్లినట్లు సోమవారం అర్ధరాత్రి గుర్తించారని తెలిపారు. వెంటనే బాలికలతో మాట్లాడి వారి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి, అక్కడ నుంచి తీసుకుని వచ్చినట్లు తెలిపారు. ఇద్దరు బాలికలను వారి తల్లిదండ్రులకు అప్పగించారు. సీఐతోపాటు పోలీసు సిబ్బందిని ఆమె అభినందించారు. టూటౌన్ ఎస్ఐ రాజు తదితరులు పాల్గొన్నారు.